క్లుప్తంగా

ఎస్పీని కలిసిన టీపీసీసీ సభ్యుడు



ఎస్పీకి మొక్క ఇస్తున్న నాగా సీతారాములు

కొత్తగూడెంరూరల్/ఇల్లెందు: ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజును టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు కలిసి పూల మొక్క అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు కరీంపాషా, రాజు, సాయి, ముకేశ్ పాల్గొన్నారు. కాగా, ఎస్పీని లయన్స్ డిస్ట్రిబ్యూటర్ కూర శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క ఇచ్చారు. అలాగే, ఎస్పీని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ కలిశారు.

క్రికెట్ విజేత, రన్నరప్ జట్లకు కలెక్టర్ అభినందన



జట్టు సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్నేహపూర్వక క్రికెట్ పోటీలో విన్నర్, రన్నరప్ జట్లు సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను మర్యాదపూర్వకంగా కలవగా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో విజేత (పంచాయతీరాజ్) జట్టు కెప్టెన్ విక్రమ్, రన్నరప్ (కలెక్టర్ పేషీ) జట్టు కెప్టెన్ దినేశ్, రెవెన్యూ జట్టు కెప్టెన్ నలిన్, ఆర్‌అండ్‌బీ జట్టు కెప్టెన్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వాలు మారినా వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన అవినీతి, అక్రమాలను రూపుమాపలేకపోతున్నాయని బీఎస్పీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జ్ ఎర్రా కామేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. విద్యా హక్కు చట్టం-2009ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో సాయి, నిరంజన్‌కుమార్, అల్లంకొండ శరత్, సందెల సందీప్ పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కోదండరామాలయం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను సీతారాముల విగ్రహాల వద్ద పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి పరాంకుశమాచార్యులు, సర్పంచ్ మంగమ్మ, ఆళ్ల శిరీష, లలిత, సుగుణ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న వట్టం నారాయణ

పాల్వంచరూరల్: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని తుడుం దెబ్బ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వట్టం నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని కొమరంభీం హాల్లో సోమవారం ఆదివాసీ ఉద్యమ సంఘాల నేతల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ, గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో సోయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ, అరెం ప్రశాంత్, కురసం రమేశ్, శెట్టిపల్లి వెంకట్, ఊకే బుల్లిబాబు, సోయం బాలు పాల్గొన్నారు.

11న ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

టేకులపల్లి: ఈ నెల 11న ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం 14వ ప్రజావేదిక (ఓపెన్ ఫోరం) ఏర్పాటు చేయనున్నామని ఎంపీడీఓ కోట వీరబాబు, ఏపీఓ కాళంగి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ సకాలంలో రావాలని కోరారు.

ఎవరో.. గడ్డు స్థితి మార్చేది..?

- ఐదున్నరేళ్లయినా అసంపూర్తిగానే పనులు
- మొనలు తేలిన రాళ్లపై తప్పని తిప్పలు
- నిరుపయోగంగా మారిన రూ.3 కోట్ల నిధులు
- చల్లసముద్రం – లచ్చగూడెం రహదారి దుస్థితి



కంకర కొట్టుకుపోయి అధ్వానంగా చల్లసముద్రం - లచ్చగూడెం రహదారి

ఇల్లెందురూరల్: అడుగడుగునా గుంత.. మొనలు తేలిన రాళ్లు.. తేలియాడుతున్న దుమ్ము.. వంటి సమస్యలతో ఆ రహదారి కునారిల్లుతోంది. నిధులు మంజూరై శంకుస్థాపన పూర్తి చేసుకొని ఐదున్నరేళ్లు గడిచినా నేటికీ నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ రహదారిని సందర్శించడం మినహా పూర్తి చేయించడంలో చొరవ తీసుకోలేకపోయారు. ఫలితంగా నేటికీ ఆ ప్రాంత వాసులు అసౌకర్యాల నడుమ రవాణా కొనసాగిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

అరున్నరేళ్ల కిందట శంకుస్థాపన

మండలంలోని చల్లసముద్రం గ్రామ పంచాయతీ నుంచి లచ్చగూడెం గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సీఆర్ఆర్ పథకంలో భాగంగా రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు 2018 జూలై 17వ తేదీన అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.

అడుగడుగునా నిర్లక్ష్యం..

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగిన ఏడాది తరువాత నిదానంగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. చల్లసముద్రం నుంచి ఆంజనేయపురం గ్రామం వరకు రహదారిని చదును చేసి కంకర పోశారు. ఆంజనేయపురం గ్రామంలో సీసీ రోడ్డు పనులు పూర్తిచేశారు. ఇక ఐదు కిలోమీటర్ల పొడవులో ఎక్కడా బీటీ పనులు నేటికీ ప్రారంభించలేదు. ఇక ఆంజనేయపురం గ్రామ సమీపంలో పెద్దచెరువు వరద కాలువ మీదుగా వంతెన నిర్మాణ పనులు నత్తతో పోటీపడేలా సాగాయి. పనులు ముందుకు సాగకపోవడంతో ఆంజనేయపురం గ్రామస్తులు ఆందోళన చేశారు. దీంతో స్పందించిన అధికారులు వంతెన నిర్మాణ పనులపై దృష్టిసారించారు. వంతెన నిర్మాణం చివరి దశలో మరోసారి పనులు నిలిచిపోవడంతో రెండేళ్ల కిందట మరోసారి గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన వంతెన నిర్మాణం పూర్తిచేశారు. కానీ ఎత్తుగా నిర్మించిన వంతెనకు అనుగుణంగా రహదారిని సరిచేయలేదు. దీంతో వంతెన మీదుగా ప్రయాణం ప్రజలకు ఇబ్బందిగా ఉంటోంది. అంతేకాకుండా రహదారిపై బీటీ వేసే పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి.

ప్రజలకు తప్పని వెతలు

చల్లసముద్రం నుంచి లచ్చగూడెం గ్రామానికి వెళ్లేందుకు మధ్యలో ఆంజనేయపురం, ఆంజనేయపురం తండా గ్రామాలు ఉన్నాయి. ఈ రహదారి గుండా వెళితే మామిడిగుండాలకు దూరభారం తగ్గుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం బీటీ రోడ్డును మంజూరు చేసింది. కానీ, నిధులు మంజూరై ఐదున్నరేళ్లయినా పనులు అసంపూర్తిగా ఉండటంతో ఈ మార్గంలో ప్రజల అవస్థలు చెప్పనలవి కావు. రహదారి పొడవునా కంకర పోసి వదిలేయడంతో రాత్రివేళ ఇంటికి చేరుకోవడానికి ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సొంత వాహనాలు ఉన్నవారు ఎలాగోలా గమ్యం చేరుకుంటుండగా పాదచారుల అవస్థలు చెప్పనలవి కావు. కనీసం కిరాయి అదనంగా ఇస్తామన్నా ఆటోలు కూడా రానిపరిస్థితి వారికి ఎదురవుతోంది. చేసేది లేక కాలినడకన ఇంటికి చేరుకోవాల్సిన దుస్థితి ఈ ప్రాంత ప్రజలది.

అస్తవ్యస్తంగా పనులు

చల్లసముద్రం నుంచి లచ్చగూడెం గ్రామం వరకు పరిచిన కంకర భారీ వర్షాల కారణంగా చాలావరకు కొట్టుకుపోయింది. కంకరపై రోలింగ్ సరిగా చేయకపోవడం వల్ల అక్కడక్కడా కుప్పలు, కుప్పలుగా దర్శనమిస్తోంది. ఆంజనేయపురం గ్రామంలో మూడేళ్ల కిందట వేసిన సీసీ రోడ్డుపై అప్పుడే కంకర తేలియాడుతోంది. ఆంజనేయపురం గ్రామ శివారులో వాగుపై నిర్మించిన వంతెనకు రహదారికి అనుసంధానంగా ఉన్న రహదారిపై మొరంతో నింపకుండా అలాగే వదిలేశారు.



వంతెన వద్ద ప్రమాదకరంగా రహదారి

నిరసన తెలిపి జైలుపాలు

చల్లసముద్రం నుంచి ఆంజనేయపురం మీదుగా లచ్చగూడెం వరకు రహదారి నిర్మాణం ఏళ్లుగా సాగడాన్ని నిరసిస్తూ ఆంజనేయపురం గ్రామస్థులు 2023 జూన్ 5వ తేదీన చల్లసముద్రం గ్రామంలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో తొమ్మిదిమందిపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. చివరకు లోక్‌అదాలత్‌లో ఒక్కొక్కరు రూ.1,200 జరిమినా చెల్లించాల్సి వచ్చింది. అయినా, రహదారి పనులు మాత్రం ముందుకు సాగకపోవడం గమనార్హం.

పనులు త్వరగా పూర్తిచేయాలి



చల్లసముద్రం గ్రామం నుంచి లచ్చగూడెం వరకు మంజూరైన బీటీరోడ్డు పనులు ఐదున్నరేళ్లుగా సాగుతున్నాయి. ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియడంలేదు. నాడు మంజూరు చేయించిన నేత నేడు మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచారు. నిర్మాణ పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయించాలి.

–అంగోత్ మంగీలాల్, ఆంజనేయపురం

చర్యలు తీసుకుంటాం



చల్లసముద్రం, లచ్చగూడెం రహదారిలో వంతెన, సీసీ రోడ్డు పనులు పూర్తిచేశాం. వంతెన వద్ద మట్టి తోలించాల్సి ఉంది. రహదారిపై కంకరపర్చాం. బీటీ వేయాల్సి ఉంది. అసంపూర్తి పనులను సరిచేసి త్వరితగతిన బీటీ వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రాజు, ఏఈ, పంచాయతీరాజ్ విభాగం

సీఎండీకి శుభాకాంక్షల వెల్లువ



సింగరేణి సీఎండీ బలరామ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం)/టేకులపల్లి: సింగరేణి సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బలరామ్ తొలిసారిగా కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయానికి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను వేద పండితులు ఆశీర్వదించారు. అనంతరం డైరెక్టర్లు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సీఎండీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మొగిలిపాక రవి, పవన్‌కుమార్, నర్సింగరావు, సింగార శ్రీను, నర్సయ్య, ఉదయ్, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అసోసియేషన్లు, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్ తదితర సంఘాల నాయకులు కూడా సీఎండీని కలిశారు. అలాగే, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మాలోత్ సురేందర్‌నాయక్ కూడా కలిశారు.

పంట రుణాల మంజూరులో జాప్యం

ఇల్లెందు: పంట రుణాల మంజూరులో యూనియన్ బ్యాంక్ జాప్యం చేస్తోందని, దీనిని అరికట్టాలని బీఆర్ఎస్ నాయకుడు దిండిగాల రాజేందర్ కోరారు. సోమవారం ఖమ్మం యూనియన్ బ్యాంక్ జిల్లా అధికారికి వినతిపత్రం అందించి మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇప్పటికీ పంట రుణాలు మంజూరు చేయలేదని, దీంతో ఎరువులు, పురుగుమందులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంట రుణాలకు సమగ్రమైన విధానం రూపొందించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక దమ్మపేట సెంటర్‌లోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూనంనేని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ కార్మిక హక్కులు హరించిపోతున్నాయని, దానికి కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారే కారణమని పేర్కొన్నారు. పోరాటాలతో సాధించుకున్న కార్మికుల హక్కు లను కాలరాస్తే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బి.నాగేశ్వరరావు, రాహుల్, దుగ్గిరాల సుధాకర్, నాగరాజు, అన్నారపు వెంకటేశ్వర్లు, బిల్డింగ్ వర్కర్స్ సంఘం నాయకులు గోపి, కోరే కృష్ణ, సురేశ్, కోటయ్య, రమేశ్, రమణ పాల్గొన్నారు.

స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలి

పాల్వంచ: అంగన్‌వాడీలు అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలని ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక రాహుల్‌గాంధీనగర్ కమ్యూనిటీ హాల్లో 'మనుషుల అక్రమ రవాణా' అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీఓ కనకదుర్గ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ.. అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా 27 ఏళ్లుగా డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్, పోలీస్, జ్యూడీషియల్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో ఇప్పటివరకు 28 వేల మంది యువతులు, మహిళలను కాపాడి పునరావాసం కల్పించామని తెలిపారు. నేటి యువత ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురవుతున్నారని, వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలన్నారు.



మాట్లాడుతున్న బలరామకృష్ణ

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సురేశ్‌కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అంబర్‌సింగ్, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలుచేయాలి



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు భద్రాచలం రోడ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం బీడీసీఆర్ రైల్వేస్టేషన్ ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ ప్రెసిడెంట్, బ్రాంచ్ సెక్రెటరీ ఖాజాబాబా మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి ఆర్థిక భరోసా ఉండదన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ వై.గోపాల్‌రావు, యూత్ సెక్రెటరీ పుల్లయ్య, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ బేరర్స్ ఓంకుమార్, రామారావు, నాగరాజు, సంపత్, శంకర్, రజనీకాంత్‌శర్మ, పవన్, రవితేజ, మనోజ్, ఉదయ్, రవిరాజు, రాకేశ్, సురేశ్, దీపక్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించి ఆదుకోవాలి..

ఇల్లెందు: అర్ధాకలితో అలమటిస్తున్న మున్సిపల్ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. దేశ, రాష్ట్రస్థాయిలో అవార్డులు తెచ్చిపెడుతున్న మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలలకోసారి వేతనాలు చెల్లిస్తుండటం విచారకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఏ నబీ, కృష్ణ, శంకర్, రామచందర్, వేణు, దాసు, దినేశ్, సౌజన్య, శ్వేత, శ్రీధర్, రవి, అనిల్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంనకు చెందిన న్యాయవాది టి.ముకుంద్‌రాజు సోమవారం మృతిచెందడంతో ఐలు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ మౌనం పాటించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.భానుమతి, బి.రామారావు, సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమేశ్‌కుమార్‌మక్కడ్, దుండ్ర రమేశ్, రావిలాల రామారావు, సంతోష్‌లాల్, పిట్టల రామారావు, యాసయుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ లోపాలే..

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనుల్లో అన్నీ లోపాలున్నట్లు సామాజిక తనిఖీలో వెల్లడైంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 14వ మండల మహాసభ సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు రూ.5.96 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రూపొందించిన నివేదికను వివరించారు. పని ప్రదేశంలో కనీసం బోర్డులు ఏర్పాటు చేయలేదని, నాటిన మొక్కల్లో కనీసం 60 శాతం బతికించలేదని, పని చేసిన కూలీకి కాకుండా వేరొకరికి వేతనం చెల్లించారని, మస్టర్లు లేకుండానే కూలీల పేరిట వేతనాలు మంజూరు చేశారని, చేసిన పనుల కంటే అదనపు కొలతలకు బిల్లులు చెల్లించారనే విషయాలు బయటికొచ్చాయి. అడిషినల్ ఏపీడీ రవికుమార్, అంబుడ్స్‌మెన్ నాగప్రకాష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వెంకటేశ్వర్లు, డీపీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణ, ఎంపీడీఓ బాలరాజు, ఏపీఓ శంకర్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా సతీశ్‌కుమార్



వాసవీక్లబ్ నూతన కమిటీ..

ఇల్లెందు: ఇల్లెందు వాసవీక్లబ్ అధ్యక్షుడిగా పుల్లూరు సతీశ్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం ఖమ్మం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలోని ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ఎలుగూరు మధుబాబు, కోశాధికారి సైఫా రాజశేఖర్ ప్రమాణం చేశారు.

మాలధారుల ఇరుముడికి ఎమ్మెల్యే హాజరు

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం కాలనీ శ్రీసీతారామాలయంలో సోమవారం జరిగిన అయ్యప్ప మాలధారుల ఇరుముడి పూజకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భేతాళపాడులో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొడ్డు కృష్ణయ్య దశదిన కర్మకు కూడా ఎమ్మెల్యే హాజరై నివాళులర్పించారు. ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పగడాల మంజుల, నాయకులు బానోత్ విజయాబాయి, దొబ్బల సౌజన్య, లేళ్ల వెంకటరెడ్డి, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మాలోత్ మంగీలాల్‌నాయక్, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్‌రావు, అల్లాడి నరసింహారావు, నర్వనేని పుల్లారావు, కృష్ణయ్య, భూపతిరావు, తోట శ్రీను, దుద్దుకూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ



చుంచుపల్లి: ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపీఓ

ఇల్లెందు: ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. నాలుగైదు రోజుల్లో అన్ని వార్డులు పూర్తి చేసేలా సాగుతోంది. మున్సిపాల్టీలోని పలువురు కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు ప్రైవేట్ ఆపరేటర్లను ఏర్పాటు చేసి ముమ్మరంగా కంప్యూటరీకరణ చేస్తున్నారు. పట్టణంలోని 24 వార్డుల నుంచి 10,373 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 15 వార్డుల ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. మరో వారం రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఎంపీఓ పరిశీలన

చుంచుపల్లి: మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటీకరణ ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుండగా సోమవారం ఎంపీఓ గుంటి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొరపాట్లు జరగకుండా ఆన్‌లైన్ చేయాలని, పూర్తయిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు కోడ్ వేయాలని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల పెద్దతండాలో వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమం ద్వారా డిజిటల్ స్క్రీన్‌లు అమర్చి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ అధికారి శరత్, రామకోటి, జల్లారపు శ్రీనివాస్, ఎడవల్లి శ్రీనివాసకుమార్, చింతలచెర్వు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీ రంగాకిరణ్

కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పెండింగ్ బిల్స్, వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే వంట కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. మార్కెట్‌లో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. రాగి జావ, అల్పాహారం తయారు చేస్తున్న కార్మికులకు వేతనం పెంచాలని కోరారు. అనంతరం డీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నారపు వెంకటేశ్వర్లు, మంగ, ప్రభావతి, సీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.